క్లుప్తంగా

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

బంగారుపాళెం: పారిశుధ్య కార్మికుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం బంగారుపాళెం ఎంపీడీఓ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, జీఓ -680 ప్రకారం స్వచ్ఛభారత్ కార్మికులకు నెలకు రూ.10 వేలు చెల్లించాలన్నారు. ప్రతి నెలా 5వ తేదీలోపు పంచాయతీ నిధుల్లో నుంచి వేతనాలు అందజేయాలన్నారు. అనంతరం వినతి పత్రాన్ని కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీధర్‌కు అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు సుబ్రమణ్యం, బాలాజీ, దాసు, బాబు, లక్ష్మి, చిట్టెమ్మ, కృష్ణమూర్తి, అల్లాబాషా, కన్నయ్య, ప్రసాద్, ప్రభాకర్, మొగిలమ్మ, షణ్ముగం, పారిశుధ్య, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

గాలీవాన నష్టం



పెనుమూరులో కూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ డివిజన్ పరిధిలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. వీటితోపాటు గాలివానకు విద్యుత్ స్తంభాలు 35, ట్రాన్స్‌ఫార్మర్లు 29, 11 కేవీ ఇన్సులేటర్లు 35, 11 కేవీ డిస్కులు 40 నేలవాలిందని ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. దీంతో శాఖకు రూ.5 లక్షల వరకు నష్టం వాటిలిందన్నారు.

దెబ్బతిన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు రూరల్ మండలంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షం వల్ల ఆ శాఖకు నష్టం ఏర్పడిందని ఈఈ హరి తెలిపారు. మొత్తం 8 విద్యుత్ స్తంభాలు, 8 ట్రాన్స్‌ఫార్మర్లు, 600 మీటర్లు కండక్టర్లు దెబ్బతిన్నాయని చెప్పారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో పునరుద్ధరణ పనులు చేపట్టారని వివరించారు.

జీతాలు చెల్లించండి

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని ఉన్నతాధికారులను కోరినట్లు ఆపస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రావణ్‌కుమార్, బాలాజీ తెలిపారు. వారు విలేకరులతో మాట్లాడుతూ బుధవారం విజయవాడలో రాష్ట్ర ఖజానా శాఖ డైరెక్టర్ మోహనరావును కలిసి వినతిపత్రం ఇచ్చామన్నారు. మూడు నెలల జీతాలు రాకపోవడంతో టీచర్లు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఈ నెల 26వ తేదీ లోపు జీతాల చెల్లింపునకు కసరత్తు చేస్తున్నట్లు ఖజానా శాఖ డైరెక్టర్ వెల్లడించారని తెలిపారు.

టంగుటూరికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

తవణంపల్లె: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్ర పటానికి ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి, ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సి.హరిరెడ్డి, నాయకులు మధుకుమార్, సాయిరెడ్డి, ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ కుమార్, సీఆర్‌పీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరులో కుండపోత



పొంగి ప్రవహిస్తున్న గువ్వకల్లు కాలువ

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలంలో కుండపోత వర్షం కురిసింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం వేకువజాము వరకు కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకల్లో వర్షపు నీరు సాగుతున్నాయి. పంట పొలాలు, బీడు భూములుసైతం నీటి కుంటలను తలపిస్తున్నాయి. ఈ వర్షంతో ప్రధానంగా వేరుశనగ పంటకు ఊపిరొచ్చింది.

జాబిల్లిని ముద్దాడిన సంబరం



చిత్తూరు కట్టమంచిలో జాతీయ జెండాలు ప్రదర్శిస్తున్న నగరవాసులు



పూతలపట్టు: రాకెట్ నమూనాతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సంబరం



చిత్తూరు సంతపేటలో ..

ఇస్రో చేపట్టిన చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడంతో జిల్లా వ్యాప్తంగా ప్రజలు సంబరాలు జరుపుకున్నారు. వీధుల్లో జాతీయ జెండాను ప్రదర్శించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు విజయోత్సాహంతో కేరింతలు కొట్టారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పలుచోట్ల స్వీట్లు పంచి పెట్టారు.

– చిత్తూరు అర్బన్ /యాదమరి/ బంగారుపాళెం/ పూతలపట్టు/



బంగారుపాళెం: జాతీయ జెండాతో యువకులు

భవనాల పరిశీలన



పరిశీలనలో ఎస్పీ రిషాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరం కన్నన్ కాలేజీ సమీపంలోని పోలీసు క్వార్టర్స్‌ను బుధవారం ఎస్పీ రిషాంత్‌రెడ్డి పరిశీలించారు. ప్రభుత్వ ఆస్పత్రి వద్ద చేపడుతున్న భవన నిర్మాణాన్ని పరిశీలించి పనులపై ఆరా తీశారు.

సమస్యలను పరిష్కరిస్తాం

చిత్తూరు రూరల్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామని ఏపీపీటీడీఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసయ్య అన్నారు. చిత్తూరు నగరంలోని రెవెన్యూ భవనంలో బుధవారం ఆ యూనియన్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

కషాయాలతో చీడపీడల నివారణ

పాలసముద్రం : ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేయడం వల్ల రసాయనాల వాడకం ఉండదని, అలాగే జీవామృతంతో తయారు చేసిన కషాయాలతో పంటలకు సోకే చీడపీడలను నివారించవచ్చని చిత్తూరు ఏపీసీఎన్‌ఎఫ్ డీపీఎం వాసు తెలిపారు. బుధవారం ఆయన రైతులకు శ్రీకావేరి రాజుపురంలో జీవామృతంతో కషాయం తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు. రైతులు ప్రకృతి వ్యవసాయంలో పంటలు సాగు చేయాలని సూచించారు. ఒక ఎకరా సాగు చేసిన పంటలో చీడపీడల నివారణకు కషాయం తయారీకి ద్రవజీవామృతం, దేశీయ ఆవుపేడ 10కేజీలు, ఆవు మూత్రం 10 లీటర్లు, నల్లబెల్లం 2 కేజీలు, పప్పు దినుసుల పిండి 2 కేజీలు, పుట్టమట్టి 1 కేజీ, వీటన్నిటిని 20 లీటర్ల నీటిలో కలియబెట్టి వారం రోజులు పులియపెట్టాలన్నారు. తరువాత పంటలకు సోకే చీడపీడల నివారణకు వాడాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో కూరగాయల సాగు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

నింద్ర: వంగ సాగులో సస్యరక్షణ తప్పనిసరిగా చేపట్టాలని ఏఓ తులసిరాం అన్నారు. బుధవారం మండలంలోని అగరం గ్రామంలో వంగ పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంగ సాగు చేసిన రైతులు పదిరోజులకు ఒకసారి సస్యరక్షణ చేపట్టాలన్నారు. వర్షాలు పడుతుండడం వల్ల చీడపీడలు చేరే అవకాశం ఉందని, తోటలో నీరు నిల్వ లేకుండా చూడాలని, చీడపీడల నివారణకు చర్యలు చేపట్టడంపై సూచనలు ఇచ్చారు. రైతులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



సరుకులను అందిస్తున్న దాత మిత్ర బృందం

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నిత్యాన్నదాన పథకానికి సరుకులను మిత్ర బృందం విరాళంగా అందించింది. మండలంలోని గుండ్లపల్లెకు చెందిన ఆంజిరెడ్డి మిత్ర బృందం 200 బస్తాల బియ్యం, సుమారు 5 టన్నుల పప్పు, నూనె, చింతపండు, కూరగాయలను ఆలయ ఈఓ వెంకటేశుకు అందించారు. దాతల బృందానికి అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

గడప గడపలో సమస్యల పరిష్కారం



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించడానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఒకటో డివిజన్ ముత్తిరేవులలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వారికి అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. స్థానికుల సమస్యలు విని, వెంటనే వాటిని పరిష్కరించాలంటూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. టెక్నికల్ ఇతరత్రా కారణాలతో పథకాలు అందనివారిని గుర్తించి, వారికి సైతం పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. డివిజన్‌లో పలు ప్రాంతాల్లో రోడ్డు వేయాలని స్థానికులు విన్నవించారు. కాలువలు నిర్మించి, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. సంబంధిత సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో చుడా చైర్మన్ పురుషోత్తం రెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, టౌన్‌బ్యాంకు చైర్మన్ రాంగణేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి నాయకులు ఎల్‌బీఐ లోకేష్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, రాంగణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇందిరానగర్‌లో: స్థానిక 48వ డివిజన్ అరగొండరోడ్డులోని ఇందిరానగర్ ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటలకు ద్రౌపదమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి ఎమ్మెల్యే పర్యటిస్తారని ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

శ్రీవారి సేవలో: తిరుమల వెంకటేశ్వరస్వామివారిని బుధవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆయన సతీమణి సత్యవతితో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి





కొత్తూరులో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

యాదమరి: పేదల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి కోరారు. యాదమరి పంచాయతీ చిన్నంపల్లె, కొత్తూరు గుట్టకిందవూరులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి నాలుగేళ్లుగా ప్రభుత్వం ద్వారా లబ్దిదారులకు అందిన పథకాలను బుక్‌లెట్ రూపంలో అందించి వివరించారు. రాబోవు ఎన్నికల్లో జగనన్నకు మరోసారి పట్టం కట్టాలని కోరారు.

ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలు

కొత్తూరు గ్రామంలో మురుగునీటి కాలువలు శుభ్రం చేయాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తాగునీరు కలుషితమవుతోందని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే పంచాయతీ అధికారులను పిలిచి తాగునీటి కలుషితం కాకుండా చూడాలని ఆదేశించారు. అధికారులు మాట్లాడుతూ పైపులైన్ పగిలిపోయిందని, వెంటనే మరమ్మతులు చేస్తామని వివరణ ఇచ్చారు. చిన్నంపల్లె, గుట్టకిందవూరు గ్రామాల్లో సిమెంట్ రోడ్లు వేయాలని, మురికి కాలువలు ఏర్పాటు చేయాలని కోరారు. చాలా వరకు ఇంటి పట్టాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ఈ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అనంతరం కొత్తూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో ఎంఈఓలు రుక్మిణీ, ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే..

గ్రామాల్లో ప్రతి గడపకు వెళ్లి గ్రామీణ ప్రజల సమస్యలు తెలుసుకొని సమస్యల పరిష్కారం కోసమే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తెలిపారు. గతంలో ఎమ్మెల్యే అనే వారు ఎన్నికల సమయంలో తప్ప ఇంకెప్పుడూ గ్రామాల వైపు చూసేవారు కాదని గుర్తుచేశారు. కానీ జగనన్న ప్రజల మనిషి కావడంతో ప్రతి మంత్రి, ప్రతి ఎమ్మెల్యే ప్రతి గ్రామానికీ వెళ్లాలని స్పష్టంగా ఆదేశించినట్లు వివరించారు. ఆయన ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో ప్రతి గడపకు వస్తున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రజలు ప్రతి సమస్యను తెలియజేస్తే సంబంధిత అధికారులతో ఆ పనులను పూర్తి చేసి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సురేష్, వైస్ ఎంపీపీలు హరనారాయణ రెడ్డి, రవీంద్రబాబు, మాజీ జెడ్పీటీసీ మనోహరన్, సర్పంచ్ ఝాన్సీ పయణి, నాయకులు కబీర్ బాషా, పరంధామగౌడ్, తహసీల్దార్ హనమంతు, ఎంపీడీఓ శివరాజ్, విద్యుత్‌శాఖ ఏడీ కోండయ్య, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, వెలుగు కార్యాలయ అధికారులు కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ ఉద్యోగులతోపాటు వెలుగు ఉద్యోగులకు 23 శాతం ఫిట్మెంట్‌ను ప్రకటించినందున నియోజకవర్గంలోని ఉద్యోగులందరూ కలసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌బాబు, వెలుగు ఏపీఎంలు కల్పలతా రెడ్డి, నాగరత్న, రవి, ప్రసాద్, మీరాబాయి, సీసీలు, అధికారులు పాల్గొన్నారు.

కాణిపాకంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



ఆలయంలో జాతీయ జెండా ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయాధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఆధ్వర్యంలో చంద్రయాన్-3 విజయవంతం కావాలని పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-3 విజయవంతమైనందుకు శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటేశు, కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, స్థానిక నాయకులు, ఐరాల మండల టీచర్ యూనియన్ నాయకులు శ్రీనివాసులు, మధు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సరే.. నీళ్లు ఎలా వెళ్లాలి?



గంగినేనిచెరువు కట్ట రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని గంగినేరు చెరువుపై చేపట్టిన పనులు అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. చెరువుకట్టపై ఇటీవల రిపేర్లు చేయడంతో పాటు రోడ్డు నిర్మాణ సమయంలో వర్షం పడినపుడు ఆ నీళ్లు వెళ్లడానికి దారి ఏర్పాటు చేయాల్సింది. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వర్షం పడ్డ ప్రతీసారి చెరువుకట్టపై ఇలా నీళ్లు నిలిచిపోతున్నాయి. దీంతో రూ.లక్షలు వెచ్చించి చేసిన చెరువుకట్ట సుందరీకరణ పనులు.. అందహీనంగా మారిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఇటువైపు దృష్టి సారించాల్సి ఉంది.

197 రామాపురంలో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రజలకు ఇంటి వద్దే వైద్యం అందుతోందని బొమ్మసముద్రం పీహెచ్‌సీ డాక్టర్ అనుష అన్నారు. 197రామాపురం దళితవాడలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది దివ్య, శిల్ప, శాంతకుమారి, సరస్వతి, అనురాధ, శశికళ పాల్గొన్నారు.

పిల్లలందరూ బడిలోనే ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: మండలంలోని బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని ఎంపీడీఓ గౌరి స్పష్టం చేశారు. ఆమె బుధవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సంక్షేమ సహాయకులకు సమీక్షా సమావేశం నిర్వహించారు. అందులో ఎంపీడీఓ మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో పిల్లలు బడికిపోకుండా ఇంటివద్దే కాలక్షేపం చేస్తున్నట్లు తెలిపారు. అలాంటి వారిని గుర్తించి పాఠశాలకు పంపించాల్సిన బాధ్యత వెల్ఫేర్ అసిస్టెంట్లదేనని గుర్తుచేశారు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం రుచి చూసి ఏవైనా సమస్యలుంటే వాటిని వెంటనే ప్రధానోపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. విద్యార్థులకు సంబంధించిన జగనన్న విద్యాదీవెన, అమ్మఒడి వంటి పథకాలను అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎవరికైనా అర్హత ఉండి పథకాలు అందకపోతే ఆ పంచాయతీకి సంబంధించిన వెల్ఫేర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. వారికి కేటాయించిన వారపు లక్ష్యాలను పూర్తిచేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలి



ముట్టుకూరులో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని స్థానిక వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని ముట్టుకూరులో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 మొబైల్ క్లినిక్ ద్వారా వివిధ రకాల రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భవతులు క్రమం తప్పకుండా పరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, తులసమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ ఝాన్సీ, డీఈఓ విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు రేణుక, లక్ష్మి, అశ్విని తదితరులు పాల్గొన్నారు.